జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 4-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 153 పేజీలు: 8 వెల : రూ.7



# స్పెషల్ బ్రాంచ్‌లో.. మొద్దునిద్ర

* అధికారుల మాటను పెడచెవిన పెడుతున్న కొందరు సిబ్బంది * నివేదికను తొక్కిపెడుతున్న మరికొందరు * పలువురు సుదీర్ఘంగా పనిచేస్తుండడమే కారణం * నిబంధనలకు వ్యతిరేకంగా బాణసంచా స్టాల్స్ ఏర్పాటు * జిల్లా పోలీస్‌బాస్ దృష్టికి వెళ్లని నివేదికలు * జరగరానిది జరిగితే బాస్‌కి మాయనిమచ్చ * ప్రక్షాళన చేయాల్సిందే అంటున్న పలువురు

**శ్రీకాకుళం క్రైం, నవంబరు 3 (వార్త):** పోలీసు శాఖకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు వెన్నెముక వంటివారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌తో పాటు జిల్లా పోలీసు కార్యాలయం, ఎస్పీ బంగ్లాలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సివిల్ డ్రెస్‌లో విధులు నిర్వహిస్తుంటారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి 18 మంది విధులు నిర్వహిస్తున్నారు. సీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, పోలీసులు పనిచేస్తున్నారు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేసే ఆఫీసర్స్, సిబ్బంది పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పనిచేసే తీరు నుంచి స్థానికంగా ఉన్న పరిస్థితులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యక్రమాలు, రాజకీయంగా చోటుచేసుకుంటున్న మార్పులు ఇంకా పోలీస్ విభాగానికి ఉపయోగపడే కీలక సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులను అప్రమత్తం చేస్తుంటారు. అదే విధంగా పాసు పోర్టు, మిస్సింగ్ డాక్యుమెంట్స్, జాబ్ వెరిఫికేషన్, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ తదితర విషయాలకు సంబంధించిన ఎంక్వయిరీ చేసి నివేదికను పోలీస్‌స్టేషన్ అధికారులకు ఇస్తారు. ఈ ఎస్బీ నివేదిక ఆధారంగా సర్టి ఫికెట్‌లను జారీ చేస్తారు. అయితే ఇలా ఎస్బిలో దీర్ఘకాలంగా కొంతమంది తిష్ట వేయడంతో వారు ఈ ఎంక్వయిరీలో అవకతవకలకు పాల్పడుతున్నారని, నివేదికలు తొక్కిపెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విభాగంలో సుదీర్ఘంగా కొంతమంది పనిచేస్తుండడమే ప్రధాన కారణమని కొందరు సివిల్ పోలీసులే బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. దీపావళి సందర్భంగా ఆర్ట్స్ కళాశాలలో సుమారు 20 స్టాల్స్ ఏర్పాటయ్యాయి. ఈ స్టాల్స్‌ను నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేశారు. కనీస నిబంధనలు పాటించలేదు. జరగరానిది జరిగి అగ్ని ప్రమాదం జరిగితే ధన, ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉండేది. అయితే అగ్నిమాపక శాఖకు చెందిన కొందరు సిబ్బంది ఈసారి కలెక్షన్‌పై దృష్టి పెట్టారే తప్ప నిబంధనలపై దృష్టి పెట్టలేదన్న విమర్శలు లేక పోలేదు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో సుమారు రెండు కోట్ల మేర బాణసంచా వ్యాపారం జరిగింది. సమయపాలన పాటించిన దాఖలాలు లేవు. దీపావళి రోజున శ్రీకాకుళం నగరంలో బాణసంచా కాల్పులు ప్రారంభమైనప్పటికీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో మాత్రం ఇంకా బాణసంచా అమ్మకాలు జరిగాయి. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా స్టాల్స్ విషయంలో నిబంధనల ఉల్లంఘనపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు జిల్లా పోలీస్ బాస్‌కు సరైన నివేదిక ఇవ్వకపోయివుంటారని కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. యువ ఐపీఎస్ అధికారి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి క్రమశిక్షణకు మారుపేరు. పోలీసులు బాధ్యతారహితంగా ప్రవర్తిస్తే చర్యలకు వెనుకాడడం లేదన్న పేరుంది. నవంబరు 1న సీఎం చంద్రబాబు శ్రీకాకుళం జిల్లాలో పర్యటించడంతో అక్కడి కట్టుదిట్టమైన బందోబస్తు పనుల్లో జిల్లా పోలీస్‌బాస్ నిమగ్నమయ్యారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులపై నమ్మకంతో బాణసంచా స్టాల్స్ ఏర్పాటుపై పెద్దగా దృష్టి సారించలేదు. ఒకవేళ జరగరాని ప్రమాదం జరిగివుంటే ఎస్పీకి ఒక మచ్చగా ఉండేది. మరో విషయమేమిటంటే బాణసంచా షాపులకు తాత్కాలిక లైసెన్సులు ఇవ్వకముందే బాణసంచా సామగ్రి లారీల్లో జిల్లాకు చేరుకుంది. వీటిపై నిఘా పెట్టడంలో కూడా స్పెషల్ బ్రాంచ్ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. కొన్నేళ్ల కిందట స్పెషల్ బ్రాంచ్ పోలీసుల వైఫల్యం వల్ల శ్రీకాకుళం నగరంలో బాణసంచా షాపు కాలిబూడిదైంది. ఒకే కుటుంబానికి చెందిన పలువురు ప్రాణాలు పోగొట్టుకోగా, కిలోమీటరు పరిధిలో భవనాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. అయితే స్పెషల్ బ్రాంచ్‌లో పోలీసులు అందరినీ అనలేం గాని, కొందరు మాత్రం సక్రమంగా పనిచేయడం లేదని, సంబంధిత అధికారుల ఆదేశాలను పట్టించుకోవడం లేదని ఆ శాఖలో పలువురు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. వారి వల్ల అందరినీ తప్పుపట్టాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా పోలీస్‌బాస్ స్పందించి స్పెషల్ బ్రాంచ్‌లో ప్రక్షాళన చేయకపోతే ఆ శాఖపై ప్రజల్లో ఉన్న నమ్మకం కోల్పోయే అవకాశం ఉంది.



# భోగాపురం-మూలపేట మధ్య.. కోస్టల్ కారిడార్



* జిల్లాలో టైటానియం కాంప్లెక్స్ ఏర్పాటుకు సన్నాహాలు * వలసల నివారణే లక్ష్యం * ఇరిగేషన్.. ఇండస్ట్రీ.. ఇదే మా నినాదం * కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, నవంబర్ 3 (వార్త):** వలసలను నివారించడమే ధ్యేయంగా శ్రీకాకుళం జిల్లా సమగ్రాభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టులను అనుసంధానిస్తూ కోస్టల్ కారిడార్ నిర్మాణానికి డీపీఆర్‌లు రూపొందిస్తున్నామని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధిపై గతంలో ఏ సీఎం కూడా జిల్లా అధికారులతో రివ్యూ చేసింది లేదని, జిల్లాలోని చాలా సమస్యల పరిష్కారానికి రివ్యూలో సీఎం తీసుకున్న నిర్ణయాలను వివరించారు. ఇరిగేషన్, ఇండస్ట్రీ ఈ రెండు మా ప్రాధాన్యతలని తెలిపారు. వంశధార పేజ్ 2, స్టేజ్ 2 పనులను జూన్ 2025 నాటికి పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. 19 టీఎంసీలు నీటిని నిలవచేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. నాగావళి, వంశధార నదుల అనుసంధానం పూర్తి చేస్తామన్నారు. ఇందులో 5000 ఎకరాలు ముంపునకు గురికాకుండా కొత్త డిజైన్లు రూపొందించామని, భూసేకరణ సమస్యలు పరిష్కరించమని చెప్పామన్నారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కోసం నూతన డిపిఆర్ వేయాలన్నారు. పలాస మండలంలో కేదారిపురం వద్ద మూడు కిలోమీటర్ల పైప్ లైన్ వేసి పలాస కాశీబుగ్గ జంట పట్టణాలకు మంచినీటిని అందిస్తామని తెలిపారు. బహుద నదిపై పలు కీలక పనుల కోసం రూ.30 కోట్లు అవసరం. ఈదుపురంలో ఎత్తిపోతల పథకం, 11 ఓపెన్ హెడ్ చానల్స్, పైడిగం ప్రాజెక్టు అభివృద్ధికి ఈ నిధులు వెచ్చిస్తామని తెలిపారు.

## జిల్లాకి టైటానియం కాంప్లెక్స్..

మూలపేట పోర్టు సమీపంలో పదివేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ ఉందని, ఇక్కడ ఫార్మా హబ్, బయోటెక్ హబ్ నిర్మిస్తామన్నారు. ఏడాదిలో పోర్టు పూర్తవుతుందని చెప్పారు. 20వేల కోట్ల టర్నోవర్ జరిగేలా బీచ్ సాండ్ ప్రాజెక్టులు కూడా అభివృద్ధి చేస్తామని, ... మిగతా 2లో

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రెండో పట్టణ సీఐగా ఈశ్వరరావు బాధ్యతల స్వీకరణ

**శ్రీకాకుళం క్రైం, నవంబరు 3 (వార్త):** శ్రీకాకుళం రెండో పట్టణ సీఐగా పి.ఈశ్వరరావు ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. 2002లో విశాఖపట్నంలో ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఈశ్వరరావు ఎనిమిదేళ్లు అక్కడే పనిచేశారు. ఆ తర్వాత పదోన్నతిపై సీఐ అయ్యారు. తొలుత సీఐడీలో రెండేళ్లు, ఆ తర్వాత విశాఖ నాలుగో టౌన్ సీఐగా, సీతమ్మధార సీఐగా, కాశీబుగ్గ రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐగా, పరవాడ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీ ప్రక్రియలో శ్రీకాకుళం రెండో పట్టణ సీఐగా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ ఈశ్వరరావుకు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇక్కడ సీఐగా ఉన్న ఉమామహేశ్వరరావుకు విశాఖ వీఆర్‌కు బదిలీ అయింది.

# క్రీడల ఖిల్లా.. సిక్కోలు జిల్లా

*** క్రీడాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది * కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు * 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం**

**శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబర్ 3(వార్త):** సిక్కోలు జిల్లా క్రీడలకు ఖిల్లా అని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, స్పోర్ట్స్ అథారిటీస్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ అనిమిని రావినాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో ఆదివారం 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామన్నారు. పాత్రునివలసలో 33 ఎకరాలలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నామన్నారు. ఖేల్ ఇండియా పథకంలో ప్రతిపాదనలు పూర్తి చేశామని వివరించారు. నాలుగు ప్రత్యేక సింథటిక్ స్పోర్ట్స్ మైదానాలు నిర్మిస్తున్నామన్నారు. క్రీడా వికాస ప్రాంగణాలు పూర్తి చేస్తామని, మన జిల్లాకు చెందిన అంతర్జాతీయ క్రీడాకారిణి కరణం మల్లేశ్వరి సహాయాన్ని కోరామని పేర్కొన్నారు. జిల్లాలో క్రీడాభివృద్ధికి ఆమె సమయాన్ని వెచ్చిస్తామన్నారని తెలిపారు. క్రీడాకారులు క్రమశిక్షణతో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. స్పోర్ట్స్ అథారిటీస్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ అనిమిని రావినాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులను క్రీడల వైపు వెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులను తరగతి గదులకే పరిమితం చేసి వారిని మానసికంగా తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం పోటీలకు సంబంధించిన క్రీడాజ్యోతిని వెలిగించారు. అనంతపురం, చిత్తూరు, ఈస్ట్ గోదావరి, గుంటూరు, కడప, కృష్ణ, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, వెస్ట్ గోదావరి, జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి తిరుమల చైతన్య, డిఎస్డిఓ శ్రీధర్, కోచ్‌లు, క్రీడాకారులు హాజరయ్యారు.



### కోడి రామ్మూర్తి స్టేడియానికి..

## పూర్వ వైభవం తీసుకువస్తాం

**స్పోర్ట్స్ అథారిటీస్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ అనిమిని రావినాయుడు**

**శ్రీకాకుళం, నవంబర్3(వార్త):** నగరంలో ఉన్న కోడి రామ్మూర్తి స్టేడియంకు పూర్వ వైభవం తీసుకువస్తామని రాష్ట్ర క్రీడల శాఖ చైర్మన్ అనిమిని రావినాయుడు అన్నారు. శాప్ చైర్మన్‌గా ఎన్నికైన తరువాత మొదటిసారిగా ఆదివారం జిల్లా పర్యటనకు విచ్చేసారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ ప్రతీ నియోజకవర్గంలోను క్రీడా వికాశ కేంద్రాలు ఉన్నాయని, వారికి అక్కడే అన్నిరకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. గ్రామ స్థాయి నుండి క్రీడాకారులను జాతీయ క్రీడల్లో పాల్గొనేలా శిక్షణ ఇస్తామన్నారు. ప్రభుత్వం, శాప్, విద్యాశాఖల సమన్వయంతో అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేసేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కోడి రామ్మూర్తి స్టేడియంను మల్టీపర్పస్ స్టేడియంను చేయాలనీ నిర్ణయించడం జరిగిందని, పనులు కూడా 90 శాతం పూర్తి అయ్యాయని కానీ గత ప్రభుత్వం పనులను ఆపేయడంతో స్టేడియం నిర్మాణం ఆగిపోయిందని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎంతో ప్రముఖ్యత కలిగిన కోడి రామ్మూర్తి స్టేడియంను పూర్తిగా విస్మరించిందన్నారు. సాధ్యమైనంత త్వరగా స్టేడియంను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు.





## వాహనాల తనిఖీ

**హిరమండలం, నవంబరు 3 (వార్త):** హిరమండలం పోలీస్ స్టేషన్ వద్ద పలు వాహనాలను ఎస్ఐ ఎండీ యసీన్ ఆదివారం తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు లేని యజమానులకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. వాహన నిబంధనలను పాటించాలని సూచించారు. మోటారు బైక్‌లు నడిపేవారు హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు పెట్టడమే గాకుండా వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించండి

**హిరమండలం, నవంబరు 3 (వార్త):** మండలంలో గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో పెద్దగూడ గిరిజన పంచాయతీ పాండ్రు మానుగూడ గ్రామంలో ఆదివాసీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దగూడ పంచాయతీ పరిధిలో పాండ్ర మానుగూడ, బలదగూడ గిరిజన గ్రామాలకు రహదారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. సమావేశంలో సవర రమేష్, కమలమ్మ, కుమార్, లక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### భోగాపురం - మూలపేట మధ్య..

## కోస్టల్ కారిడార్

(మొదటిపేజి తరువాయి)

20వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇసుక నుంచి ముఖ్య ఖనిజాలను వేరు చేసే టైటానియం కాంప్లెక్స్‌ను ఇక్కడ స్థాపిస్తామన్నారు. మూలపేట సమీపంలో ఎయిర్‌పోర్టు నిర్మించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రతి నియోజకవర్గంలో ఒక ఎమ్మెస్ఎంఈ పార్క్ ఏర్పాటుచేసి సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహిస్తామన్నారు.

### రోడ్లపై ప్రత్యేక శ్రద్ధ..

నరసన్నపేట జమ్ము జంక్షన్ నుంచి ఇచ్ఛాపురం వరకు జాతీయ రహదారిని ఆరు లైన్లుగా రూపొందిస్తామన్నారు. కళింగపట్నం- పార్వతీపురం రోడ్డు, అలాగే బత్తిలి- అలికాం రోడ్డు జాతీయ రహదారుల సంస్థ పరిధిలోకి వెళ్లేలా ప్రయత్నిస్తున్నామన్నారు. డోల- పోలాకి- నౌపడ రోడ్డు అభివృద్ధికి జాతీయ రహదారి సంస్థ నిధులు అడిగామని, శ్రీకాకుళం నగరం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదన కూడా చేశామని మంత్రి చెప్పారు.

### టెంపుల్ సర్క్యూట్ టూరిజం..

కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో అరసవెల్లి, శ్రీకూర్మం దేవాలయాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. టెంపుల్ సర్క్యూట్ టూరిజం అభివృద్ధి చేయాలని, జిల్లా కేంద్రంలో డచ్ బంగ్లా చుట్టూ నగర వాసులకు మంచి ఎంటర్టైన్మెంట్ దొరికేలా టూరిజం ప్రాజెక్టులను రూపొందిస్తున్నామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం చుట్టూ రింగ్ రోడ్డు ప్రతిపాదన సిద్ధమవుతుందని చెప్పారు. ఆమదాలవలస - శ్రీకాకుళం రోడ్డు నిర్మాణం కోసం ఇటీవల రూ. 5.5 కోట్లు విడుదల చేశామని, ఇంకా రూ.10 కోట్లు విడుదల చేస్తామని, రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు చెప్పారు.



### పంచారామ క్షేత్రాలకు..


## ప్రత్యేక బస్సులు

**శ్రీకాకుళం టౌన్, నవంబర్3(వార్త):** ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి (అమరారామం), భీమవరం (భీమారామం), పాలకొల్లు (క్షీరారామం), ద్రాక్షారామం, సామర్లకోట (కుమారారామం) క్షేత్రాలను కార్తీకమాసంలో భక్తులు దర్శించుకునేందుకు గాను ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి విజయకుమార్ తెలిపారు. ఈ నెల 10,17, 23వ తేదీల్లో పలాస, టెక్కలి, శ్రీకాకుళం డిపోల నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సులు బయలు దేరుతాయన్నారు. సూపర్ లగ్జరీ, ఆల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కూడా ఉందని చెప్పారు. ప్రతి ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు బయలుదేరి సోమవారం ఐదు పుణ్య క్షేత్రాలను దర్శింపచేసి, మంగళవారం ఉదయం ఆరు గంటలకు తిరిగి జిల్లాకు చేరుకుంటారన్నారు. పూర్తిగా బస్సు బుక్ చేసుకున్నవారి ఇంటి వద్దకే బస్సు పంపబడుతుందన్నారు. బస్సు చార్జీల వివరాలు మనిషి ఒక్కంటికి శ్రీకాకుళం నుంచి సూపర్ లగ్జరీ రూ.2400, ఆల్ట్రా డీలక్స్ రూ.2350, ఎక్స్‌ప్రెస్ రూ.2000గా నిర్ణయించామన్నారు. శ్రీకాకుళం నుండి విశాఖ దర్శిని, అరుకు దర్శిని, శైవ క్షేత్రాల దర్శిని ప్రాంతాలకు పిక్నిక్ స్పాట్ లకు వెళ్లేందుకు అద్దె ప్రాతిపదికన బస్సులు కేటాయిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజర్, శ్రీకాకుళం 1వ డిపో(9959225608), అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్): (7095040608,) డిపో మేనేజర్, శ్రీకాకుళం 2వ డిపో (9959225609), అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్): (7382917289), డిపో మేనేజర్, టెక్కలి డిపో(9959225611), అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్): (7382923311), డిపో మేనేజర్, పలాస డిపో (9959225610), అసిస్టెంట్ మేనేజర్, (ట్రాఫిక్): (7382924758) సంప్రదించాలని కోరారు. ఆదివారం సాయంత్రం శ్రీకాకుళం కాంప్లెక్స్ నుండి పంచారామాల క్షేత్ర దర్శిని ప్రత్యేక బస్సుని శ్రీకాకుళం 1వ డిపో మేనేజర్, అమరసింహుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రమేష్, స్టేషన్ మేనేజర్ శ్రీను, యం.పి.రావు, సూపర్వైజర్ బాషా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిత్యునికి విరాళాల వెల్లువ



**అరసవల్లి, నవంబరు 3 (వార్త):** ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత సూర్య నారాయణ స్వామి దేవస్థానానికి దాతల నుంచి విరాళాలు వెల్లువెత్తాయి. శ్రీకాకుళం వాస్తవ్యులు మన్మధరావు, సరోజనమ్మ దంపతుల రెండో కుమారుడు బలివాడ ప్రభాకర్‌రావు, సత్యవతి దంపతులు శాశ్వత అన్నదానం పథకం నిమిత్తం లక్ష రూపాయలను చెక్కు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజుకు అందజేశారు. అంతకుముందు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే విశాఖపట్నం వాస్తవ్యుడు వైశ్యరాజు సురేష్ చంద్రరాజ్, ఉషారాణి దంపతులు శాశ్వత అన్నదానం పథకం నిమిత్తం రూ.1,00,116/-లు చెక్కు రూపంలో అందజేశారు. ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి టికెట్లు రూపేనా రూ.2,67,000, పూజలు , విరాళాల రూపంలో రూ.77,166, ప్రసాదాల రూపంలో రూ.2,32,920 ఆదాయం వచ్చిందని ఈవో యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రత్యూష ఆదివారం సూర్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదాలను ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు అందజేశారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కళాకారులకు ఘన సత్కారం

**పాతపట్నం, నవంబర్ 3(వార్త):** పవిత్ర కార్తీక మాసం ఆరంభం సందర్భంగా తామర గ్రామంలో వెలసియున్న శ్రీ కోదండ రామాలయంలో 24 గంటల పాటు అఖండ నామ సంకీర్తన నిర్విరామంగా సాగింది. సంకీర్తనలో పాల్గొన్న కళాకారులను ఆలయ ధర్మకర్త, పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఘనంగా సత్కరించారు. ఆలయ ప్రతిష్ఠ నుంచి ప్రతీ ఏడాది సంకీర్తనలతో పాటు, శ్రీరామ నవమి, వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.



# ఏకలవ్య విద్యార్థులకు తప్పని తిప్పలు

**-పెండింగ్ పనులు ఎప్పటికీ పూర్తయ్యేనో**
**-తాగునీటికీ కట..కట**
**- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం**
**-ఇంజనీరింగ్ శాఖ అలసత్వం**

**భామిని, నవంబర్ 3(వార్త):** కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ అలసత్వం విద్యార్థులకు శాపంగా మారింది. పనులు చేపట్టి ఏళ్లు గడిచినా నేటికీ పూర్తికాని పరిస్థితి నెలకొంది. కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయి. తాగునీటి కష్టాలు ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు తప్పడం లేదు. సొంత భవనాలకు చేరుకున్నా వారికి ఉన్నవి అరకొర వసతులే. పూర్తయిన తరగతి గదులను బాలురు, బాలికలకు కేటాయించారు. రోజూ భోజనాల అనంతరం విద్యార్థులు ప్లేట్లు కడుక్కొనేందుకు భోజనశాలలో నీటి కొరత నెలకొంది. దీంతో సమీపంలోని పొలాల్లోకి వెళ్లే నీటితో శుభ్ర పరచుకుంటున్నారు. విద్యార్థుల రాకతో పెండింగ్‌లో ఉన్న రోడ్డు, మరుగుదొడ్లు, కాలువ, తాగునీటి బోరు ఏర్పాటు పనులు చేపడుతున్నారు. బోరు నీరు అందడం లేదని సిబ్బంది, విద్యార్థులు వాపోతున్నారు.





ఈ పాఠశాలలో 660 మంది విద్యార్థులు చదువుతు న్నారు. ప్రస్తుతానికి పాఠశాల తరగతి భవనాలు మినహా బాలికలు, బాలుర వసతి భవనాలు, భోజన, వంట గది, ప్రిన్సిపాల్, సిబ్బంది నివాస భవనాల పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా తాగునీటి సౌకర్యం కల్పించాలని వారంతా ముక్తకంఠంతో కోరుతున్నారు. విద్యార్థుల రాకతో ఎట్టకేలకు సీసీ రోడ్డు పనుల్లో కదలిక వచ్చింది. గ్రామీణ ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలతో ఈ రోడ్డు పనులను ప్రారంభించారు. ప్రధాన రహదారి నుంచి పాఠశాలలోని సిబ్బంది నివాసాలు కలిపి, 600 మీటర్ల సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని జేఈ సత్యనారాయణ తెలిపారు.

# విద్యార్థులకు రామానుజన్ గణిత ప్రతిభా పరీక్ష



**పాతపట్నం, నవంబర్ 3(వార్త):** గణిత ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో పాతపట్నం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు గణిత ప్రతిభా పరీక్షను ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.

పరీక్ష పేపర్లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వైకుంఠరావు, పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి అమర జనార్దరరావు మాస్టారు ఆవిష్కరించారు. ఈ పరీక్షకు మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు 58 మంది, 9వ తరగతి విద్యార్థులు 43 మంది, ఎనిమిదవ తరగతి విద్యార్థులు 45 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుల ఫోరం కన్వీనర్ రేగటి మధుసూదన్‌రావు, గణిత ఉపాధ్యాయులు అంకడాల గోవిందరావు, కె.అప్పారావు, జి.గోవిందరావు, ఎస్.రామారావు, ఎన్.మన్మథరావు, ఎస్.లక్ష్మణరావు, పి.శంకరరావు, పి.భవాని, వై.సుందరమ్మ, పి.బాబూరావు, జె.గణపతిరావు, ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



**ఇచ్ఛాపురం, నవంబర్ 3(వార్త):** జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సాధించి ఈనెల మధ్యప్రదేశ్ రాష్ట్రంలో భోపాల్‌లో జరుగుతున్న 68వ జాతీయస్థాయి పోటీలకు ఈనెల 8న పయనమవుతున్నారు. ఎ.రేవంత్ రెడ్డి అండర్-78 కేజీల కేటగిరి, నీలాపు భగవాన్ అండర్-51 కేజీ కేటగిరిలో ఎంపికయ్యారు. అంతర్ యూనివర్సిటీ సెలెక్షన్స్‌లో అక్టోబర్ 30న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో జరిగిన సెలెక్షన్స్‌లో ఎ.భువనేశ్వరి అండర్-53 కేజీల కేటగిరి, ఉప్పాడ అను 65 కేజీల కేటగిరిలో ఎన్నికయ్యారు. నవంబర్ 12 నుంచి 15వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని గురునానక్‌దేవ్ యూనివర్సిటీ అమృత్‌సర్‌లో జరగబోయే అంతర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎన్నికైన ఈ విద్యార్థులను తైక్వాండో మాస్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రతినిధి పిలక విజయభాస్కర్ రెడ్డి, రెండో వార్డ్ కౌన్సిలర్ ప్రతినిధి చాట్ల తిరుపతి, టీడీపీ పట్టణ కార్యనిర్వహణ కార్యదర్శి బత్తిన కృష్ణయ్య, గోల్డ్ మర్చంట్ చెన్నూరు మధుకుమార్, ఆర్మీ విశ్రాంత ఉద్యోగి దక్కత సుమన్ రెడ్డి, ఎల్సీ రావు పాల్గొన్నారు. ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులకు చిన్నారి మధు, దక్కత సుమన్ రెడ్డి, ఎల్‌సీ రావు ఆర్థిక సహకారాన్ని అందించారు.



## పాఠశాలకు పూర్వ విద్యార్థుల విరాళం

**ఇచ్ఛాపురం, నవంబర్ 3(వార్త):** కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2006 పదో తరగతి విద్యార్థులు రూ.60000లు విరాళంగా అందించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన హాల్ నిర్మాణానికి అందజేశారు. ఈ మొత్తాన్ని అందించిన వారిలో రంగాల బాలకృష్ణ, రంగాల సరస్వతి, వడ్డిన తేజారెడ్డి, పూజారి సోమేష్, దట్టి కేదారి, పిలక ఢిల్లేష్, దీర్ఘాసి వేణుగోపాల్, ఖేత్రో బాసి, వలపల బాలకృష్ణ, భోజరాజు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం నరేంద్ర పట్నాయక్ వారిని అభినందించారు.

## పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ



**మందస, నవంబర్ 3(వార్త):** మొక్కలు నాటి, వాటిని చెట్లుగా పెంచాలని శ్రీసత్యసాయిసేవా సమితి ప్రతినిధులు కోరారు. సత్యసాయి ప్రేమతరు కార్యక్రమంలో భాగంగా మందస మండలంలోని భైరిసారంగపురంలో ఆదివారం వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని తప్పక పెంచి పెద్ద చేయాలన్నారు. ఇప్పటికే ప్రకృతి సంపదను కోల్పోయి, భవిష్యత్ తరాలకు ముప్పు ఏర్పడే పరిస్థితులు తీసుకువచ్చామన్నారు. ఇప్పటికైనా మేల్కొనాలని కోరారు. కార్యక్రమంలో తులసీరావు. అప్పలస్వామి, మాధవరావు, పురుషోత్తం, సేవాసమితి సభ్యులు వడ్డి అప్పారావు, ఇప్పిలి కేశవరావు(చిట్టి) తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్మింగ్ క్రీడాకారులకు అభినందన



**ఇచ్ఛాపురం, నవంబర్ 3(వార్త):** ఈనెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నరసరావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీలకు అండర్-19 విభాగంలో ఎన్నికైన గోవింద్ బెహరా, తరుణ్ బెహరా, సాగర్ బెహరా, రాజు బెహరా, నిరాకర్ బెహరాను సురంగి రాజా క్రీడా మైదానం ఆవరణలో అలయన్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా అలయన్స్ క్లబ్ ప్రతినిధులు రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రయాణ ఖర్చుల నిమిత్తం ఆలయన్స్ క్లబ్ సభ్యులు బత్తుల వెంకటరమణ ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ సభ్యులు బి.గోపి, సీహెచ్ లోహిదాస్, మురళీధర్, దక్కత సుమన్, నరసింహమూర్తి, ఉమాశంకర్, వెంకటరమణ, బుజ్జి పాల్గొన్నారు.

## మూఢ నమ్మకాలను పారదోలుదాం

**మందస, నవంబర్ 3(వార్త):** సనాతన ధర్మం పేరిట మహిళలను మూఢ నమ్మకాలలో ముంచేస్తున్నారని మూఢనమ్మకాల నిర్మూలన సంఘం ప్రతినిధులు అన్నారు. హరిపురంలో గల మార్పు ట్రస్ట్ గ్రంథాలయంలో ఆదివారం 'మూఢ నమ్మకాలు-మహిళలు' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సనాతన ధర్మం పేరిట మహిళలను మూఢ నమ్మకాల ఊబిలోకి నెట్టి వారికి స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారన్నారు. వారిని చైతన్యం చేసి విద్యావంతులుగా మార్చి, సమాజ అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. కార్యక్రమంలో మూఢనమ్మకాల నిర్మూలన సంఘం కన్వీనర్ మార్పు జగన్మోహన్ రావు, మామిడి కోదండరావు, నగిరి కరుణాకర్, ఎన్.హడ్డి, బి.నారాయణరావు, డి.రమణ, ఆర్.దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.



# నేడు జుత్తు జగన్నాయకులు వర్ధంతి

మందస, నవంబరు 3(వార్త): పలాస నియోజకవర్గ ప్రథమ ఎమ్మెల్యే స్వర్గీయ జుత్తు జగన్నాయకులు వర్ధంతి ఈనెల 4న నిర్వహించనున్నారు. ఆయన సొంత గ్రామం బిడిమి గ్రామంలో జుత్తు ఘాటు వద్ద, హరిపురం గ్రామంలో రట్టి రోడ్డు జంక్షన్‌లో, నారాయణపురం గ్రామంలో, భేతాళపురంలో గల విగ్రహాలు వద్ద, కవిటి మండలంలో కవిటి గ్రామంలో, సోంపేట మండలంలో, వజ్రపు కొత్తూరు మండలం పూండి గ్రామంలో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వైకాపా నాయకుడు బత్తిని లక్ష్మణ్ చెప్పారు. జగన్నాయకుల అభిమానులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.




## రూ.5.40 లక్షల రికవరీకి ఆదేశాలు

**జలుమూరు, నవంబర్ 3(వార్త):** సారవకోట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన ప్రజావేదికలో రూ.5.40 లక్షలు రికవరీ చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. స్థానిక సిబ్బంది ఉపాధి పనులలో అవినీతికి పాల్పడినట్టు సోషల్ ఆడిట్లో నిర్ధారణ కావడంతో ఆ మొత్తం రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. మండలంలో ఉన్న 35 పంచాయతీలలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేయనున్నట్లు తెలిపారు.

## బోర్ వేశారు.. హెడ్ మరిచారు



**జలుమూరు, నవంబర్ 3(వార్త):** సారవకోట మండలం అంగూరు సచివాలయం ఆవరణలో కొన్నేళ్ల క్రితం తవ్విన బోర్కు హెడ్ బిగించకపోవడంతో నిరూపయోగంగా ఉంది. గత ప్రభుత్వం హయాంలో సచివాలయంలో తాగు నీటి సదుపాయం కోసం ఈ బోరు మంజూరు చేశారు. అయితే అప్పటి నుంచి నేటికీ బోర్కు హెడ్ గానీ, మోటార్ గానీ బిగించకపోవడంతో సచివాలయం సిబ్బంది తాగునీటికి అవస్థలు పడుతున్నారు.

## భక్తులతో కిటకిటలాడిన శ్రీముఖలింగం



**జలుమూరు, నవంబర్ 3(వార్త):** జలుమూరు మండలములోని ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగేశ్వరుని ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదివారం కావడంతో జిల్లా నలుమూలల నుంచి మాత్రమే కాకుండా ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మొదటి సోమవారం రద్దీగా ఉండే అవకాశం ఉందని ఆలయ ఈవో తెలిపారు.

## విద్యార్థులకు గణిత పోటీ పరీక్షలు

**జలుమూరు, నవంబర్ 3(వార్త):** నరసన్నపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గణిత పోటీ పరీక్షలను నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం జరిగిన ఈ పరీక్షల్లో 8వ తరగతి విద్యార్థులు 59 మంది, 9వ తరగతి విద్యార్థులు 45 మంది, పదవ తరగతి విద్యార్థులు 63 మంది పాల్గొన్నారన్నారు. విజేతలుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులను అందజేశామని తెలిపారు.



# మినీ ఇండోర్ స్టేడియం అభివృద్ధికి కృషి



**జలుమూరు, నవంబర్ 3(వార్త):** నరసన్నపేట మినీ ఇండోర్ స్టేడియం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని బగ్గు రమణమూర్తి అన్నారు. స్పోర్ట్స్ అథారిటీస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ అనిమిని రవినాయుడుతో కలిసి ఆదివారం ఆయన ఈ స్టేడియంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండోర్ స్టేడియంలో అన్ని పరికరాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ప్రతీ నియోజకవర్గంలోను క్రీడా వికాస కేంద్రాలు ఉన్నాయని, వారికి అక్కడే అన్నిరకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను జాతీయ క్రీడల్లో పాల్గొనేలా శిక్షణ ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు క్రీడలపై ఆసక్తి ఉందని, రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్ చేయాలనే ఆలోచన ఉన్నట్టు చెప్పారు. రాష్ట్రం నుంచి క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పాల్గొనేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం క్రీడాకారులకు అందుబాటులో ఉండేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత సిలిండర్లు.. పేదల ఆశా దీపం



**పాతపట్నం, నవంబర్ 3(వార్త):** పాతపట్నంలోని దువ్వార వీధిలో సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా సంవత్సరానికి పేదలకు 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆదివారం ప్రారంభించారు. ఉచిత సిలిండర్లను మహిళలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం పేద కుటుంబాలకు ఆర్థిక దన్ను ఇస్తుందన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచెత్తినప్పటికీ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తుందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పాల్గొన్నారు.

# వీరభద్రరావు ఆదర్శప్రాయుడు

**పాతపట్నం, నవంబర్ 3(వార్త):** స్వర్గీయ కొంచాడ వీరభద్రరావు ఆదర్శప్రాయులని పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నం మండలం తిడ్డిమి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కొంచాడ వీరభద్రరావు కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణలో ఆదివారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4సార్లు సర్పంచ్‌గా, 2సార్లు ఏఎంసీ చైర్మన్‌గా, పీఏసీఎస్ డైరెక్టర్‌గా, 2 సార్లు మండల తెలుగుదేశం అధ్యక్షులుగా వీరభద్రరావు చేసిన సేవలను కొనియాడారు ఆయన లేని లోటు వ్యక్తిగతంగా తనకు తీరనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలు

**మందస, నవంబరు 3(వార్త):** మందస మండలంలోని హరిపురంలో గల పెద్ద వీధిలో ఆదివారం విద్యుత్ ప్రమాదం చోటు చేసుకుంది.

ఇదే గ్రామానికి చెందిన సాయి.. విద్యుత్ స్తంభం పైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో స్తంభం పైనుంచి కింద పడిన సాయికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను హుటాహుటిన 108 అంబులెన్స్ హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రా నికి తరలించారు. కానీ పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి, చికిత్స అందజేస్తున్నారు.

# హెూంగార్డు అనుమానాస్పద మృతి

**వంగర, నవంబర్ 3(వార్త):** మద్యం మత్తులో రాళ్లపై పడి హెూంగార్డ్ మృతి చెందినట్లు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి.

శివ్వాం గ్రామానికి చెందిన హెూంగార్డ్ పొదిలాపు అప్పలనాయుడు (53) మెట్టమగ్గూరు గ్రామానికి ఆనించి ఉన్న మడ్డువలస డ్యాం మీద నున్న రిటైనింగ్ వాల్ పక్కన రాళ్ల మీద శవమై ఆదివారం కనిపించాడు. ఈయ నకు మద్యం అలవాటు బాగా ఉన్నట్లు శివ్వాం గ్రామస్తుల ద్వారా తెలిసింది. కొన్ని రోజుల నుంచి ప్రతి రోజూ సాయంకాలం హెూంగార్డు డ్యాం మీదకు వస్తున్నట్లు పలువురు సమాచా రం మేరకు తెలిసింది. శనివారం రాత్రి కూడా ఇక్కడకు వచ్చి రిటైనింగ్ వాల్ మీద పడుకొని నిద్రమత్తులో డ్యాం రిటై నింగ్‌వాల్ పక్కన రాళ్ల మీదను శవంగా తెల్లాడు. ఈయన కొన్నాళ్లు వంగరలో హెూంగార్డుగా పని చేశారు. అప్పలనా యుడు మరణవార్త తెలుసుకొని వంగర శవాన్ని గుర్తించి పోస్ట్‌మార్టం కోసం రాజాం ప్రభుత్వ హాస్పటల్‌కు తర లించినట్లు పోలీసులు తెలిపారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆయన మృతిపై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# ఎట్టకేలకు తోటవూరు రోడ్డుకు మోక్షం!

**- నెల రోజుల్లో పనులు పునః ప్రారంభిస్తామని ఎమ్మెల్యే హామీ!**

**-హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు**

**సోంపేట, నవంబర్ 3(వార్త):** సోంపేట మండలం తోటవూరు నుంచి ఎకువూరు వరకు ఉప్పుటేరుపై వంతెన నిర్మాణంతో కాంట్రాక్టర్లు, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పనుల్లో ఆలస్యం జరిగిందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ అశోక్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సంక్రాంతి నాటికి పెండింగ్లో ఉన్న పనులన్నీ పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశామ న్నారు. గడిచిన ఐదేళ్లుగా ఇబ్బందులు పడుతున్న తోటవూరు, సిరిమామిడి, రాజాం, ఎకువూరు, నడుమూరు, బట్టి గల్లూరు, డొంకులూరు గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా పనులు పునః ప్రారం భిస్తున్నట్లు తోటవూరు గ్రామస్తులకు ఆయన పూర్తిస్థాయి భరోసా ఇచ్చారు. గ్రామంలో ఉత్సవాలు మరో మూడు నెలల్లో ఉన్న నేపథ్యంలో గ్రామానికి చెందిన అరుణోదయ యువజన సంఘం, గ్రామ సంఘం ప్రతినిధులు ఆదివారం రాత్రి ఎమ్మెల్యే స్వగృహం రామయ్యపుట్టుగలో టీడీపీ రాష్ట్ర కార్య దర్శి చంద్ర మోహన్ ఆధ్వర్యంలో కలి శారు. ఈ సందర్భంగా రోడ్డు దుస్థితిని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అనేకమార్లు ఈ రోడ్డు పరిస్థితి స్వయంగా తాను చూశానని, గత ప్రభు త్వం నిర్లక్ష్యం కారణంగా రోడ్డు పనుల్లో జాప్యం జరిగిందని, త్వరలో ఈ పనులు పూర్తి చేయాలని సంబం ధిత కాంట్రాక్టర్లు అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమం లో గ్రామానికి చెందిన భర్తు దామోదర్, రిక్క ఈశ్వరరావు, తోట యాదవరావు, తోట నాగేశ్వరరావు, భర్తు వెంకట రావు, భర్తు రాజు, భర్త శంకర్రావు, కోనేటి రాజారావు, తోట లక్ష్మీ నారా యణ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే హామీపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.



# జైభీమ్ సేన నూతన కార్యవర్గం



**సోంపేట, నవంబర్ 3(వార్త):** సోంపేటలోని జై భీమ్ సేన కార్యాల యంలో భీమ్ సేన సర్వసభ్య సమావే శం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశంలో సమస్యలు- పరిష్కా రాలు, జై భీమ్‌సేన ద్వితీయ వార్షికోత్స వం, సభ్యుల చేరిక మొదలగు అంశా లపై సుదీర్ఘంగా చర్చించారు. చల్లా దేవరాజునే జిల్లా అసోసియేట్ ప్రెసి డెంట్‌గా, నూతలపాటి బాబూరావు జై భీమ్ సేన కంచిలి శాఖ గౌరవ అధ్య క్షులుగా, గుంద్ర జగ్గారావు, జై భీమ్ సేన కంచిలి మండల ఉపాధ్యక్షులుగా, దూసి మధుసూదనరావు, జై భీమ్ సేన సోంపేట మండల గౌరవాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్ర మాన్ని ఉద్దేశించి వ్యవస్థాపకులు డాక్టర్ నగిరి మోహన్‌రావు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలని ముందుకు తీసుకెళ్లాలని, దానికి అనుగుణంగా సభ్యులు మమేకం కావాలని తెలియ జేశారు. కార్యక్రమంలో జై భీమ్ సేన జిల్లా అధ్యక్షులు బుస్క ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి డోప్ప వెంకట్రావు, బుద్దేస్ అచ్యుతు, ధర్మరావు, దేవరాజు, హర్షవర్ధన్, నారాయణమూర్తి, భగవతి లీలారాణి తదితరులు పాల్గొన్నారు.



## గణిత ప్రతిభా పరీక్ష

**మందస, నవంబర్ 3(వార్త):** మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్షను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8, 9, 10వ తరగతి విద్యార్థులకు మందసలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షలకు వివిధ ప్రభుత్వ పాఠశాలల నుండి 135మంది విద్యార్థులు విచ్చేశారని గణిత వేదిక మండల ప్రతి నిధులు గవ్వ భీమారావు, వమరవల్లి మురళి తెలిపారు. 10వ తరగతి నుంచి పైల కీర్తన ప్రథమస్థానం, బాడ శ్రీజ ద్వితీయస్థానం, కె.దీపిక, ఎం.హర్ష తృతీయ స్థానం, పి.ధనుష్, కె.జోషిత 4వ స్థానం, ఎం.రేణుక 5వ స్థానంలో నిలిచారు. 9వ తరగతి విభాగంలో ఎ.రష్మిత ప్రథమస్థానం, పి.వికాష్, పి.షణ్ముఖరావు ద్వితీయ, డి.త్రిలోచన 3వ, ఎన్.భార్గవి 4వ, టి.మౌనిక, కె.జ్ఞానేశ్వరి, జి.దేవి, వి.ప్రవీణ్ 5వ స్థానం సాధించారు. 8వ తరగతి విభాగంలో డి.లిఖిత ప్రథమ, జె.నిహారిక ద్వితీయ, ఎం.మణికంఠ తృతీయ, టి.కార్తీక్, జి.కృష్ణారాకేష్, ఐ.ధన లక్ష్మి, టి.దివాకర్ 4వ స్థానంలో నిలిచారు. వీరికి జిల్లా స్థాయి పరీక్ష నవంబర్ 17న కాశీబుగ్గ కేంద్రంగా ఉంటుంది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జె.రవికుమార్, పలాస ఎంఈఓ-2 సీ.హెచ్ సత్యం, రామచంద్ర పాణిగ్రాహి, జె.జానకమ్మ, గణిత ఉపాధ్యాయులు ఎన్.అరుణ్‌కుమార్, సురేష్‌చంద్ర పండా, సింహాచలపతి, డి.కృష్ణారావు, ఈ.శ్రీనివాసరావు, ఎస్.ప్రకాశరావు, పి.భాస్కర రావు, ఎస్.నారాయణరావు, ఎన్.కిరణ్, ఎ.ఈశ్వరరావు, బి.రమేష్ పాల్గొన్నారు.

## కార్తీక పూజల్లో భక్తులు అప్రమత్తంగా ఉండాలి



**సోంపేట, నవంబర్ 3(వార్త):** కార్తీకమాసం వన భోజనాలు, సముద్ర స్నానాల సందర్భంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలని, సందర్శకుల భద్రత దృష్ట్యా తీర ప్రాంతంలో బారువ మెరైన్ పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు బారువ మెరైన్ సీఐ డీవీజీ రమేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేక రులతో మాట్లాడారు. ప్రజలు మెరైన్ పోలీసు వారి సూచనలు, హెచ్చరికలు పాటించి సహకరించాలని కోరారు. ముఖ్యంగా యువత, ఆకతాయిలు, మద్యం సేవించి సముద్రంలో దిగరాదని, తల్లిదండ్రులు సెల్‌ఫోన్, సెల్ఫీల మోజులో పడి పిల్లల్ని విడిచిపెట్టరాదని కోరారు. మహిళలు, యువతీ, యువకులు జన సందో హంలో ఉండాలని, ఒంటరిగా, దూరంగా ఉండరాదని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులను తిరిగి తల్లిదండ్రులకు అప్పజెప్పినంతవరకు స్కూల్ యాజమాన్యమే బాధ్యత తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా కాపాడవలసిన బాధ్యత వాళ్లదే అన్నారు. గత అనుభవాలను గుర్తుతెచ్చుకొని అప్రమత్తంగా ఉండాలని యాజమాన్యాలను కోరారు. సోంపేట, మందస మండ లాల పరిధిలోని రట్టి, చిగలపుట్టుగ, భేతాళపురం, గంగువాడ, గెడ్డవూరు, ఎర్ర ముక్కాం తదితర ప్రాంతాల్లో ఎలుగుబంట్లు సంచారం ఉన్నందున చీకటి పడక ముందే తిరుగు ప్రయాణం చేయాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి, తీర ప్రాంత పర్యావరణను పాడు చేయరాదని సూచించారు. సముద్ర లోతు ప్రాంతాలను, ఉధృతిని అంచనా వేయడం సాధ్యం కాదని. ప్రమాద నివారణ దృష్ట్యా మెరైన్ పోలీస్‌కి సహకరించ గలరని కోరారు. బారువా, పుక్కల్లపాలెం, రట్టి చిగలపుట్టుగ బీచ్‌లలో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

## మౌలిక వసతులు కల్పించండి

**ఇచ్ఛాపురం, నవంబర్ 3(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి 23వ వార్డులో మౌలిక వసతులు కల్పించాలని వార్డు తెలుగుదేశం ప్రతినిధి శాసన శేఖర్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కి వినతిపత్రం అందజ ేశారు. రోడ్లు, కాలువలు నిర్మిచాలని కోరారు. ఐదేళ్లుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని చెప్పారు. మైనార్టీలు అధికంగా ఉన్న వార్డు అభివృద్ధికి సహక రించాలని కోరారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413